


## నకిలీ పులి

అంతరించిపోతున్న అరుదైన పులిని ఫోటో తీసానంటూ నమ్మబలికిన జావో జెగంగ్ అనే చైనా రైతు ప్రస్తుతం జైలు పాలయ్యాడు. గత సంవత్సరం అక్టోబరులో చైనా ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. దాదాపు ఇరవయ్యేళ్ళుగా ఎవరికీ కనిపించకుండా అదృశ్యమైపోయిన దక్షిణ చైనా ప్రాంతపు పులిని ఎవరైనా కనుగొంటే వారికి 146,000 డాలర్ల బహుమానం అందిస్తామని ప్రకటించింది. ఈ ప్రకటన విన్న జావో జెగంగ్ ఒక డజను డిజిటల్ ఫోటోలతో ప్రభుత్వ కార్యాలయంలో ప్రవేశించాడు. తాను ఆ పులిని కనుగొన్నానని చెప్పి ఫోటోలు చూపించి బహుమానం తీసుకుపోయాడు. అయితే ప్రభుత్వం ఆ ఫోటోలను ఆన్‌లైన్‌లో పెట్టినపుడు కొందరికి అనుమానం వచ్చింది. చుట్టూ పరిసరాల స్పష్టతతో పోలిస్తే ఆ పులి బొమ్మ మరింత స్పష్టంగా ఉన్నట్టు కనిపించింది. దీనిపై ఫిర్యాదులు ఎక్కువ అందటంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ ఫోటోల్ని డిజిటల్ మాయ చేసి మామూలు పొదల మధ్య ఎప్పటిదో పాత పులి ఫోటో ఇరికించి తయారు చేశారని తేలింది. జావో జెగంగ్‌ను గట్టిగా ప్రశ్నిస్తే, తాను ఆ పులి బొమ్మను పక్క గ్రామంలో ఒక వ్యక్తి దగ్గర కొన్నానని ఒప్పుకున్నాడు. ప్రస్తుతం తన మోసానికి ఫలితంగా అతను ఏకంగా రెండేళ్ళ జైలు శిక్ష అనుభవించాలి. అంతేకాదు, రెండొందల తొంభై డాలర్ల జరిమానా కూడా భరించాలి.

## పెంపుడు కుక్క కోసం ప్రాణాలకు తెగించి...



తమ యజమానుల కోసం ప్రాణాలకు తెగించే కుక్కల గురించి విన్నాం; ఇది తన కుక్క కోసం ప్రాణాలకు తెగించిన యజమాని వార్త. యాభై మూడేళ్ళ గ్రెగ్ లినోయిర్ అనే వ్యక్తి జేక్ అనే తన పెంపుడు కుక్కతో సముద్రంలో ఈదుతున్నాడు. హఠాత్తుగా ఒక షార్క్ చేప కుక్కను నోట కరుచుకు పోసాగింది. జేక్ నీటిలో మునిగిపోవడం చూసి గ్రెగ్ ఒక పెద్ద అరుపు అరిచి షార్క్ మీద పడ్డాడు. ''నాకేం తోచలేదు. పిడికిళ్ళు బిగించి నా శక్తి కొద్దీ దాని వైపు దూసుకు పోయాను. దాని మెడపై బలమంతా ఉపయోగించి గుద్ద సాగాను. అది శరీరంలా లేదు; కాంక్రీట్‌లా ఉంది,'' అంటూ ఆ భయానక అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు గ్రెగ్. ఆ ఊహించని దాడికి షార్క్ బెదిరి కుక్కని వదిలి పారిపోయింది. కుక్కను చేత బుచ్చుకుని ఒడ్డుకు ఈదుకుంటూ వచ్చేశాడు గ్రెగ్. షార్క్‌నోట పడినా, జేక్ పొట్ట మీద, వీపు మీద స్వల్పంగా పంటి గాయాలు మినహా, పెద్ద ప్రమాదం ఏమీ లేకుండా బయటపడటం మరింత ఆశ్చర్యం. ''మాకు పిల్లలు లేరు. జేక్ మాకు పిల్లాడి లాంటిదే. షార్క్ దాన్ని నోటకరిచినప్పుడు 'ఇలా జరగడానికి వీల్లేదు' అన్న ఒక్క ఆలోచనే నా మెదడులోకి వచ్చింది. చెప్పలేని ఆవేశం వచ్చేసింది,'' అంటున్నాడు గ్రెగ్.

## 'సరసి'కత

వైశంపాయనుడికి చిన్నపుడు దృష్టద్యుమ్నుడని ఓ బెస్టు ఫ్రెండుండేవాడు. అప్పట్లో వీళ్లిద్దరూ గుమ్టీ బిళ్లాటలో ఎక్స్‌పర్టులు.

ఓ రోజు దృష్టద్యుమ్నుడు కొట్టిన గుమ్టీబిళ్ల రివ్వున వెళ్ళి పేడ ఎత్తుకుంటూ రోడ్డు మీద పోతున్న పాపాయమ్మ అనే ఓ ఆడపిల్ల తలకి తగిలింది. ఆమె ఓ పొలికేక పెట్టి కూలబడిపోయింది. పిల్లలంతా గుమిగూడి చచ్చిపోయిందన్నారు. పోలీసులొచ్చి ఖైదులో పెట్టేస్తారేమోనని భయపడిపోయిన దుష్టద్యుమ్నుడు వూరొదిలి పారిపోయాడు. ఆ పోక పోక పాతికేళ్లకు గానీ మళ్ళీ తేలలేదు.

ఈ వ్యవధిలో అతగాడు ఆశ్చర్యకరంగా రాజకీయాల్లో చేరి, మంత్రి కూడా అయిపోయాడు.

వైశంపాయనుడి చొరవతో జాతీయ గుమ్టీ క్రీడల పోటీలకు వాళ్ల ఊరును కూడా ఒక వేదికగా చేయడం, ఆ ఆటల్ని ప్రారంభించడానికి సాక్షాత్తూ ఆ మంత్రి గారే రావడం కూడా జరిగింది.

చాలా ఏళ్ల తర్వాత మళ్లీ గుమ్టీ క్రీడ ఆడుతున్నందుకు దృష్టద్యుమ్నుడు గారు

### జాతీయ గుమ్టీ బిళ్లల పోటీలు



పరవశించిపోయి, కాసిని కళ్లనీళ్లు కూడా పెట్టుకున్నారు. పురజనుల కరతాళధ్వనుల మధ్య పోటీలను ప్రారంభిస్తూ గుమ్టీబిళ్లను కర్రతో లాగిపెట్టి బలంగా కొట్టేరు మంత్రిగారు.

ఆ బిళ్ల రివ్వున వెళ్లి రోడ్డు మీద వెడుతున్న ఓ పెద్దావిడకి తగిలింది.దాంతో ఆమె కిందపడి పోయింది. మంత్రిగారు మందీ మార్బలంతో వెళ్లి ఉపచర్యలు చేసి, మంచినీళ్లు పట్టించేసరికి ఆమె తేరుకుని కళ్లు తెరిచింది. ఆమె ఎవరో కాదు, చిన్నపుడు తన గుమ్టీబిళ్ల తగిలిన పాపాయమ్మే. ఇప్పుడు కూడా కాకతాళీయంగా మళ్ళీ ఆమెకే తగిలింది.

''ఓరినీ నువ్వట్రా! నువ్వేదో బాగుపడ్డావన్నారే ఎవరో. పాతికేళ్లయినా నువ్వింకా ఈ గుంటీబిళ్ల వదల్లేదన్నమాట. నీకెప్పటికి బుద్ధొస్తుందిరా దుష్టిగా!'' అంటూ తిట్టిపోసిందామె.